# ఋణం

## క్యానం నాగ అన్నపూర్ణాదేవి

పట్టుమని పద్నాలుగేళ్ళుండవు.

అపరాధిలా నిలబడ్డాడు బాబులు. వాడి కళ్ళల్లో పసితనం కొట్టొచ్చినట్టుగా కనబడుతోంది. చేయని నేరం మీద పడ్డంతో కాబోలు గుడ్లనీరు నింపుకుంటున్నాడు. భయంతో వణికి పోతున్నాడు.

వెక్కి వెక్కి ఏడుస్తున్నట్టుగా గొంతు అదురుతోంది. భయం భయంగా అర్జునరావ్ కేసి చూసాడు.

"నాకేం తెలీదు" గొణుక్కుంటున్నాడు బాబులు.

అర్జున్‌రావ్ ఎరుపెక్కిన కళ్ళతో "చెప్పు వెధవా నీ తోలు వలిచేస్తాను. గొలుసు ఎక్కడ దాచావు?" గద్దించాడు.

ఆ గద్దింపుకి బాబులుగాడి లాగు తడిసి పోయింది.

శరీరంలో కొద్దిగా కంపన. నోరువిప్పి "నాకేమీ తెలీదు" అని చెప్పలేని బేలతనం వాడిలో కనబడుతూనే వుంది.

వాడి మొహంలోకి చూస్తే ఏ దొంగతనమూ చేయనట్టే వున్నాడు.

సుగుణకి ఓ పక్క జాలిగావుంది. మరో పక్క జంకుగానూ వుంది.

అర్జునరావు వొట్టి రాక్షసుడు.

పసివాడన్న జాలి, దయా అతనిలో ఏ కోశానాలేవు. ఆ సంగతికూడా సుగుణకి బాగా తెలుసు.

అర్జునరావు ఆరేళ్ళ కూతురు రత్నని తీసుకుని చెల్లెలు సుగుణ ఇంటికి వచ్చేడు.

పల్లగాలికని రత్నని అలా బయటకి తీసుకెళ్ళమని బాబులుగాడికి సుగుణ చెప్పింది. అమ్మగారు చెప్పారనీ చిన్నపిల్లనీ, ముచ్చటగా ఆడించాలన్న సరదాకొద్దీ రత్నని వాడు రాములువారి గుడి దగ్గరికి తీసుకువెళ్ళాడు.


రాములు వారికి దండం పెట్టుకుని, పూజారి గారికి నమస్కారంచేసి పాపతోసహా వెళ్ళి మండపం దగ్గర కూర్చుని కాసేపు ఆడించి ఇంటికి తీసుకొచ్చాడు.

నిజానికి జరిగింది అంతే!

అసలా పిల్ల మెడలో బంగారు గొలుసు వున్నదా లేదా అన్న సంగతి కూడా బాబులు గమనించనే లేదు.

-చెంప ఛెళ్ మంది.

బాబులు చెంపపైన అయిదు వేళ్ళ తేలాయి! ఒక్కసారి చుట్టూ వున్న ప్రపంచం గిర్రున తిరిగినట్టయింది. "అమ్మా" అని అరిచాడు. ఆ క్షణంలో వాడికి తనని కన్నది ఎవరో తెలీని అమ్మ, గుర్తొచ్చింది. ఆ తల్లే ఎదురుగా వుంటే వాడిని రక్షించుకోక వూరుకునేదా?




కన్సొలేషన్ బహుమతి రూ.500 పొందిన కథ.

సుగుణకి ఆ దెబ్బ గుండెపైన పడినట్టయింది.

"అన్నయ్యా నువ్వు తొందర పడుతున్నావు. ఎంతపని కుర్రాడైతే మాత్రం అలా కొడతావా ? చిన్నతనం నించీ వాడిక్కడే పెరిగాడు. వాడికి 'నా' అన్న వారెవరూలేరు. నీ కూతురి గొలుసు దొంగిలించి వాడేం చేసుకుంటాడు ? ఎవరి కిస్తాడు" అంది కోపంగా.

అర్జునరావు సుగుణకేసి కోపంగా చూసేడు.



"నీకు తెలీదు సుగుణా, పోరంబోకు సన్నాసులని చేరవేస్తే ఇలాగే జరుగుతుంది. ఏమీ ఎరుగనట్టే వుంగి, దొరికింది చంకనెట్టు కెళ్ళిపోతారు లం...కొడుకులు."

"వాడికల్లాంటి బుద్ధులు లేవు. నీవు అనవసరంగా వాడ్ని హింస పెడుతున్నావు, ఈ విషయం మీ బావగారికి తెలిస్తే వూరుకోరు" కానీ అప్పటికే అర్జునరావు బెల్టుతో బాబులుగాడి వీపు చిట్లిపోయేలా కొట్టాడు.

"ఎవరో ఒళ్లు పొగరెక్కి కని, చెత్తకుండీలో పడేస్తే బతికి బట్టకట్టిన వెధవీడు. ఇల్లాంటి వాడికి విశ్వాసం, నీతి, నిజాయితీ ఎక్కణ్ణించి వస్తాయి. నాలుగు తగిలిస్తే నిజం వాడే కక్కేస్తాడు.

మళ్ళీ దెబ్బపడింది. బాబులు నేలపైన పడి ఏడుస్తున్నాడు.

ఊహ తెలిసింది మొదలు సుగుణ ఇంటోనే వుంటున్నాడు, బాబు

బాబుల్ని ఎనిమిదో ఏట జట్కా బండి సాయిబు "దాదా" తీసుకొచ్చి ఆ ఇంట్లో పెట్టాడు. ఏళ్ళు గడిచాయి. దాదా ప్రతి రెండు మూడు రోజులకీవచ్చి బాబులుగాడినిచూసి తినడానికి ఏదన్నా మిఠాయిపొట్లం వాడిచేతిలో పెట్టి వెళతాడు. అది బాబులు ఆత్రంతో తీసుకుంటే దాదాకి ఎంతో ఇష్టం. తృప్తి.

దాదా తర్వాత బాబులుకి తెలిసిన రెండో వ్యక్తి సుగుణ. తల్లి ఎవరో తెలియకపోయినా మనసులోనే సుగుణని తల్లిగా అనుకుంటాడు.

ఆ ఇంట్లో పనిచెయ్యడానికే దాదా పెట్టింది. మొదట్లో చిన్నచిన్న పనులు ఎలా చేయాలో మెల్లగా సుగుణ బాబులుకి నేర్పింది. తెల్లారకట్ట నాలుగున్నరకే లేచి నీళ్ళుపట్టడం, బూత్‌కివెళ్ళి పాలు పట్టుకురావడం, సుగుణ నిద్రలేచేసరికే బాయిలర్ వెలిగించేస్తాడు. ఆనందరావ్, అంటే సుగుణ భర్తకి బెడ్‌కాఫీ అందించి నిద్రలేపేది కూడా బాబులే ఆనందరావు కూడా బాబుల్ని చాలా ఆదరంగానే చూస్తాడు.

ఒక్క మాటలో చెప్పాలంటే ఆ భార్యాభర్తల నోట్లో నాలుకలా వుంటాడు బాబులు.

భార్యాభర్తలు ఇంటినిసైతం వాడి భారంపైన వదిలి బయటకువెళతారు. అల్లాంటిదీనాడు తన అన్నయ్య కూతురు రత్న మెడలో గొలుసుని వాడు దొంగిలించాడంటే ఆమె నమ్మలేకపోతోంది. కారణం బీరువాలో వేలకివేలు డబ్బుంటుంది బీరువా తాళాలు ఎక్కడుంటాయో బాబులికి తెలుసు కాని ఎప్పుడూ ఒక్క రూపాయి కూడా పోలేదు.

బాబులు మెడని పట్టుకున్నాడు అర్జునరావు. తోడేలు నోట్లో చిక్కుకున్న మేకపిల్లలా

వున్నది వాడి పరిస్థితి. భయంతోనూ, దిక్కు తోచని స్థితిలోనూ "నన్ను కాపాడమ్మా" అన్నట్లుగా దీనంగా చూస్తున్నాడు బాబులు.

"అన్నయ్యా. వాడి నొదలేయ్! ఏమన్నా అయితే లేనిపోనిది పరువు నష్టం" అంది సుగుణ.

బాబుల్ని తండ్రి కొడుతుంటే బిక్క మొహం వేసి చూస్తోంది రత్న. సుగుణ మెల్లిగా రత్న దగ్గరకి నడిచింది.

"ఏమ్మా, రత్నా, నీ మెడలో గొలుసు ఏమయిందో చెప్పమ్మా" అంది అనునయంగా.

రత్న భయంగా చూసింది. బాబుల్ని కొడుతున్నట్టు తనని కూడా కొడతారని భయపడిపోయి రాగం మొదలుపెట్టింది.

"వీడి పని ఇలా కాదే సుగుణా, పోలీసుల కప్పగిస్తే కానీ నిజం చెప్పడు" అంటూ అర్జునరావు బాబుల్ని రెక్క పట్టుకుని బరబరా ఈడ్చుకెళ్ళిపోయాడు. అడ్డుపడి ఆపాలనుకొంది కానీ సుగుణ అయోమయంగా నిలబడిపోయింది భర్త వస్తే ఏం చెప్పాలో తోచడంలేదు. భర్త సంగతి సుగుణకి బాగా తెలుసు. ఆమె గుండెని నలిపినట్టుగా వుంది. స్వతహాగా అన్నంటే సుగుణకీ భయమే.

గుండెల్లోంచి చలి ఒళ్ళంతా ప్రాకిందొక్కసారిగా. కడుపులో ఏదో మంట. "అబ్బ" అనుకుంది. సుగుణ గ్రహించింది. మరిలా రక్తస్రావం ఎక్కువైంది. గబగబా బాత్‌రూంలోకి పరుగు తీసింది.

ఈ మధ్యన తరచుగా వస్తోందీ నొప్పి. డాక్టరు దగ్గరకు వెళ్ళాలనుకుంటూనే అశ్రద్ధ చేసేస్తోంది.

కానీ ఇప్పుడీనెప్పికన్నా ఘోరంగా బాబులుని పోలీసులకి వొప్పగించడం సుగుణకి ఏడుపొస్తోంది. వాడిని పోలీసులేం చేస్తారో.

పని కుర్రాడే అయినా బాబులు అంటే ఆయనకి ప్రత్యేకమయిన అభిమానం వుంది. చిన్నవాడే అయినా వాడు చెప్పే మాటల్ని చాలా శ్రద్ధగా వింటాడు ఆనందరావు.

కోర్టునించి ఇంటికిరాగానే బాబులుతో కలిసి తోట పనిచేస్తాడు ఆనందరావు. వాళ్ళిద్దర్నీ ఆ సమయంలో చూస్తే వాళ్లు తండ్రీ కొడుకుల్లా అనిపిస్తారు.

బాబుల్ని తన అన్న పెట్టిన హింస గురించి తెలిస్తే ఆనందరావు అగ్గి అయిపోతాడని సుగుణకి బాగా తెలుసు. కాని అన్న మూర్ఖత్వం కూడా ఆవిడకి బాగా తెలుసు. కోపంవస్తే చెల్లెలన్న అభిమానం కూడా లేకుండా మాట్లాడతాడు. అందుకే భయం ఆమెకి.

దిగులుగా తలుపు పట్టుకుని నిలబడిపోయింది సుగుణ. ఆమెకి గుండెలో కెలికినట్టుగా వుంది.

సుగుణకి పిల్లలు లేరు. పెళ్ళయ్యాక నాలుగైదుసార్లు అబార్షన్స్ అయ్యాయి. వచ్చిన ఏ కడుపూ నిలవలేదు. అయిదోసారి అబార్షన్ అయినప్పుడు చాలా సీరియస్ అయింది. డాక్టర్లు గర్భసంచీ తీసేశారు. అందువల్ల ఆమెకి ఇంక పిల్లలు పుట్టే అవకాశం లేకుండాపోయింది. అందుచేత ఆవిడ గొడ్రాలి క్రిందే లెఖ్ఖ

వంశాంకురం కోసం ఆనందరావుని మరో పెళ్ళి చేసుకోమంది. కానీ ఆనందరావు అందుకు మాత్రం వప్పుకోలేదు. బాబులు చిన్నతనంనించీ తన ఇంట్లో పెరిగిన కారణం చేతనో లేక పిల్లల మీదవున్న మక్కువ చేతనో కానీ బాబులు అంటే ఆయనకీ ఎనలేని ప్రేమ.

"ఏంటమ్మా ఆలోచిస్తున్నారు?"

సుగుణ ఉలిక్కిపడి చూసింది.

ఎదురుగా జట్కాబండి సాయిబు "దాదా" నిలబడి వున్నాడు. దాదా చేతిలో మిఠాయి పొట్లం.

"దాదా నువ్వా? ఇటొచ్చావే?" అడిగింది.

ఆమె మాటలకి దాదా ఆశ్చర్యంగా చూసేడు. ఆమె ఎప్పుడూ ఆ విధంగా అడగలేదు దాదా ప్రతి రెండు మూడు రోజులకీ తన ఇంటికి వస్తాడని ఆమెకి తెల్సుసు.



రెట్టింపు

"ఇప్పుడు నా రచనలు చదివేవారి సంఖ్య రెట్టింపయింది తెల్సా?" అన్నాడు రవి.

"అయితే నీకు పెళ్ళి అయిందన్నమాట!" సాలోచనగా అన్నాడు హరి.

—బి. వి. కేశి (గుంటూరు)

"బాబులు ఏడమ్మా?" అడిగేడు దాదా.

సుగుణ అయోమయ పరిస్థితిలో పడిపోయింది. దాదాకి ఏమని చెప్పాలి? బాబులు దొంగతనం చేసాడని, తన అన్న వాడ్ని చావగొట్టి పోలీసులకి అప్పగించేడని, తను చూస్తూ వూరుకున్నానని ఎలా చెప్పగలదు? చెబితే దాదా తనని క్షమిస్తాడా? మొహంమీద వూస్తాడు. నిజానికి ఆమెకీ తీవ్రమయిన బాధగానే వుంది. కాని ఏదో నిస్సహాయత, బేలతనం, ఆమెని నిర్లిప్తంగానూ, నిస్తేజంగానూ వుండేలా చేస్తోంది.

అపరాధం చేసినదానిలా చూసింది దాదాకేసి సుగుణ. ఆమె కళ్ళల్లో నీరు సుడులుతిరుగుతోంది.

మాట్లాడాలంటే గొంతు పెగలడం లేదు.

"చెప్పమ్మా. వాణ్ణి ఓసారి చూసిపోతాను" ప్రాధేయపూర్వకంగా అడుగుతున్నాడు దాదా.

"ఎవణ్ణిరా చూసేది. ఆ దొంగ గాడిదనేనా? వెళ్లు. పెళ్ళి పోలీసుస్టేషన్‌లో చూడు" అప్పుడే వచ్చిన అర్జునరావు మాటలకి దాదా నిరుత్తరుడయ్యాడు.

**సుగుణకి పిల్లలు లేరు. పెళ్ళయ్యాక నాలుగైదుసార్లు అబార్షన్స్ అయ్యాయి. వచ్చిన ఏ కడుపూ నిలవలేదు. అయిదోసారి అబార్షన్ అయినప్పుడు చాలా సీరియస్ అయింది. డాక్టర్లు గర్భసంచీ తీసేశారు. అందువల్ల....**

"ఏమిటి బాబూ. బాబులు దొంగా ?" దాదా విస్తుపోయాడు

"అవున్రా దొంగే. పోలీసులు నాలుగు తగిలిస్తే వాడే ఈ పాటికి నిజం చెప్పి వుంటాడు"

దాదా కళ్ళలో నీరు సిలిచింది రోషంగా చూసాడు.

"మంచిద బాబూ బాగా బుద్ధి చెప్పారు. అంతకన్నా మా ప్రాణాలు తీసేస్తే సరిపోయేది. ఏమ్మా సుగుణమ్మ తల్లీ అఘం శుభం తెలీని పసిబిడ్డని నీకు అప్పగించాను. వాకు దొంగా తల్లీ ? వాడి బుద్ధి ఎల్లాంటిదో మీకూ తెలీదామ్మా? వాడు దొంగని నువ్వు నమ్ముతున్నావా ?"

"ఏడిశావులే. పెద్ద చెప్పొస్తున్నావు మా చెల్లికీ, బావకీ బుద్ధిలేదసలు నీలాంటి లేబరుగాళ్ళ తో పొత్తు పెట్టుకోవడానికి. వాడసలు గొలుసుని నీకే ఇచ్చి వుంటాడు" అర్జునరావు మాటలకి దాదా కళ్ల ఎర్రబారినయి.

"బాబూ !"

అది పిలుపు కాదు. అరుపు కాదు. ప్రళయ గర్జన. ఆ కంఠస్వరంలోని తీవ్రతకి అర్జునరావుకి చలి జ్వరం వచ్చినట్టయింది. చేతిలో కమ్చీని గాలిలోకి విదిలించి కొట్టాడు దాదా.

"ఛీ! నాయాల, అదే మరో 'నా కొడుకు కూస్తే ఈ కమ్చీతో తోలు వూడదీసేవోడ్ని. నీ నక్క బుర్రని నాకేనాడో తెలుసురా. ఏమ్మా. సుగుణమ్మ తల్లీ. ఆఖరికి పెద్దింటిదానివనిపించావు. అల్లా సాక్షిగా బిడ్డ దొంగ కాదమ్మా. నిజంగా వాగిలో దొంగబుద్దే గనక వుంటే, వాడు మీ గొలుసు దొంగిలించివుంటే, వాడిని ముక్కలు ముక్కలుగా నేనే నరికి పారేస్తాను" అంటూ విసురుగా వెళ్ళిపోయాడు దాదా.

సుగుణ ఏడుస్తూ "ఏమిట్రా అన్నయ్యా ఈ గొడవంతాను మీ బావగారొస్తే ఇంకేం గొడవ చేస్తారో. వెళ్ళి వాడ్ని తీసుకురా" అంటూ తలని గోడకేసి కొట్టుకుంది సుగుణ. కానీ ఆనందరావు అప్పటికే లోపలికి వచ్చాడు.

"గొడవ చేయడానికి ఏముంది సుగుణా. మీ అన్నయ్య వచ్చినప్పుడల్లా ఏదో ప్రాబ్లమ్‌ని సృష్టించడం అలవాటేగా, ఇదిగో గొలుసు" అంటూ ఆనందరావు గొలుసుని తీసి అందించాడు.

అర్జునరావు ఆశ్చర్యంగా చూసాడు.

సుగుణ కళ్ళు ముడుచుకుంటూ "ఇది మీ దగ్గరకి ఎలా వచ్చింది ?" అడిగింది.

"నేను క్లబ్బుకి వెడుతున్నప్పుడు 'రత్న' బయట ఆడుతుంటే చిన్నపిల్ల మెడలో గొలుసు వుండడం ప్రమాదమని నేనే తీశాను హడావిడిలో చెప్పడం మరచిపోయాను. పొరపాటు నాదే" అన్నాడు ఆనందరావు.

"ఎంత పని జరిగిందండి. వాడిని పోలీసులు ఏ హింస పెడుతున్నారో," అంది సుగుణ ఏడుస్తూ. దరిదాపుగా వాడిని ఎనిమిదో ఏటనుండి ఆమే పెంచింది మరి. పెంచిన మమకారం ఎక్కడికి పోతుంది.



నీకివ్వను

"నాన్నా! నా పెళ్ళికి కట్నం తీసుకోదల్చుకోలేదు..." అన్నాడు మోహన్.

"సర్లేవోయ్! కట్నం డబ్బు నీకివ్వను, నేనే వుంచుకుంటాను సరా!" అన్నాడు వెంకట్రావు.

—సుజయశ్రీ (ఆదోని)


5 సంవత్సరాలు గ్యారంటీ గల మెరీ సూపర్ స్పెషల్ బంగారు కవరింగ్ నగలను 15 సంవత్సరాల పరిశోధన ఫలితంగా – భారత ప్రప్రథమంగా తయారు చేస్తూ, దేశమంతటా విరివిగా వి. పి. పి. ద్వారా పంపే సంస్థ. ఉచితంగా కేటలాగ్ పొంది అన్ని వివరాలు చూడగలరు. ఇందులోని సంఖ్యలు సూచిస్తూ, ఉత్తరం రాస్తే, వి. పి. పి. ద్వారా వస్తువులు పంపబడతాయి.

(వి. పి. పి. చార్జీలు అదనం)




**MERI GOLD COVERING WORKS.** (Estd: 1963)
**P.O. BOX 1405, 14, RANGANATHAN STREET**
**T. NAGAR MADRAS-600 017 INDIA**

ఆనందరావు ఈసడింపుగా చూసేడు అర్జునరావు కేసి. అటు తర్వాత టెలిఫోన్ దగ్గరకి నడిచి పోలీసు స్టేషన్‌కి ఫోన్‌చేసి ఇన్స్‌పెక్టర్‌కి గొలుసు ఇంట్లోనే వుందని, బాబులిని టార్చర్ చెయ్యొద్దని చెప్పాడు.

అదే సమయానికి కొద్ది క్షణాల ముందు 'దాదా' ని కానిస్టేబుల్ బయటికి నెట్టేశాడు.

దాదా మాటలని ఇన్స్పెక్టర్ గానీ, పోలీసులు గానీ వినలేదు. బాబులు స్పృహ తప్పి కటకటాల అవతల నేలపైన పడివున్నాడు. అసలు ప్రాణం వుందో లేదో అన్నట్టు వున్నాడు.

బాబుల్ని ఆ స్థితిలో చూడగానే దాదా గుండె కలుక్కు మంది. దాదా కళ్ళముందు ముక్కుపచ్చలారకుండా, గోదావరి గట్టున దొరికిన ఓ చిన్నారి బిడ్డ కినబడుతున్నాడు. 'అల్లా' ఇచ్చిన బిడ్డగా తెచ్చి, 'ఉగ్గ' బెట్టి పెంచుకున్నాడు. తన గుండెలపైన ఆడించాడు. అలాంటి బిడ్డన్ని, ఇలాంటి దారుణ హింసాకాండకి గురిచేసిన వాళ్ళని నరికేయాలని వుంది. తన మాటలెవ్వరూ వినరు. తనకి సహాయం చేసే దిక్కు లేదు. బాబుల్ని తన కిచ్చేస్తే నిశ్చింతంగా వెళ్ళిపోతాడు. కానీ పోలీసులు తనని బయటికి నెట్టేశారు.

దాదా ఏడుస్తూ 'గుఱ్ఱబ్బండి దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. ఏం చేయడానికి తోచడంలేదు. అసలు బిడ్డ ప్రాణంతో వున్నాడా? భయంతో దాదాకి వణుకు వస్తోంది.

అయిదు నిముషాల తర్వాత కానిస్టేబుల్ వచ్చి దాదాని లోపలికి పిలుచుకెళ్ళాడు.

"ఆ కుర్రాడిని తీసుకుపో" అన్నాడు ఇన్స్పెక్టర్. అది ఆనందరావు ఫోన్ చేసిన తర్వాత.

దాదా వణుకుతున్న చేతులతో బాబుల్ని ఎత్తుకున్నాడు. వాడు స్పృహలో లేడు. ఒక్కసారి స్టేషన్లో అందరిని కసిగా చూసాడు.

"పసి బిడ్డని కొట్టడానికి చేతులెలా వస్తాయో! పసివాళ్ళని హింస పెట్టేవాళ్ళు మనుష్యులు కారు బాబూ. మనిషి ఆకారంలోవున్న క్రూరమృగాలు. అధికారం చేతిలో వుంది కదా అని పాపపు పనులు చేస్తున్నారు ఇట్లాంటి పరిస్థితి మీ బిడ్డలకొచ్చినప్పుడు గానీ మీకు తెలిసిరాదు"

"ఊ. ఫో బయటకి" నెట్టేశాడు 'హెడ్'

దాదా మెల్లిగా బాబుల్ని గుర్రం బండిలో పడుకోబెట్టి బండిని కదిలించాడు. బాబులు వళ్ళంతా కమిలిపోయి వుంది. దాదా కళ్ళు తడి అవుతున్నాయి.

బాగా పొద్దుపోయింది. గుడిసెలో దిగులుగా కూర్చుని లాంతరు వెలుతురులో బాబులు వంటికి కాపడం పెడుతున్నాడు దాదా. బాబులు బాధగా మూలుగుతున్నాడు.

"ఎంతన్నా చెప్పు దాదా. ఈ వున్నోళ్ళ తెగులిదేరా :" అంటున్నాడు ఫకీరు జాలిగా.

(68వ పేజీ చూడండి)



### గుడ్డివాళ్ళు

"ఏమోయ్! ఈ మధ్య బొత్తిగా కనపడ్డం మానేశావ్!?"

"నేనా! అసలు నువ్వే కనపడడం మానేశావు"

"ఏమిటి! గుడ్డివాళ్ళలా మాట్లాడుకుంటున్నారు!" అన్నాడు అప్పుడేవచ్చిన అప్పారావు

—సుజయశ్రీ (ఆదోని)




"కర్కశంగా, గరుకుగాఉండే పళ్ళపొడులు మీ పళ్ళకు, చిగుళ్ళకు హానికలిగించవచ్చు..."

## కోల్గేట్ టూత్ పౌడర్‌తో మీ చిగుళ్ళను, చెడుశ్వాసను కూడా అరికట్టండి పళ్ళను కాపాడుకోండి.

కోల్గేట్ టూత్ పౌడర్ ఎంతో మెత్తగా ఉండే తెల్లని పౌడర్. అది అతి మృదువుగా మీచిగుళ్ళను తోముతుంది. అంతేగాకుండా దానిలో ఉండే సున్నితమైన మెరుగునిచ్చే పదార్థం మీ పళ్ళ మీది పాచిపొరలను తొలగిస్తుంది. మీ పళ్ళను శుభ్రపరచి తెల్లగా చేస్తుంది. కోల్గేట్‌లోని పుష్కలమైన నురుగునిచ్చే చర్య పళ్ళ సందులలోనికి చొచ్చుకుపోయి చెడు వాసనను దంతక్షయకారకములైన సూక్ష్మ క్రిములను తొలగిస్తుంది.

మీ కుటుంబానికి కోల్గేట్ టూత్ పౌడర్‌తో అధునాతనమైన తీరులో దంతరక్షణ సమకూర్చండి. దానియొక్క చల్లని, పిప్పర్‌మెంట్ రుచిని వారంతా మెచ్చుకుంటారు.




TPG31TL

(18వ పేజీ తరువాయి)

"నా బిడ్డ బంగారు కొండరా ఫకిరు. వీడు దొంగట. ఆ మాట మారోమారంటే ఈ కమ్చీతో వాళ్ళ తోలు వలిచేస్తాను" చెబుతున్నాడు దాదా.

"దాదా"

ఆ మాటలకి వెనుదిరిగి చూసాడు దాదా. ఆనందరావు విచారవదనంతో నిలబడి వున్నాడు. మనిషి నిర్వికారంగా వున్నాడు. జరగింది ఎంత ఘోరమైన సంఘటనో ఆనందరావుకి తెలుసు.

"ఏం చేస్తున్నావు దాదా?" విషయాన్ని ఎలా కదపాలో తెలియక ఆనందరావు వేసిన అర్థం లేని ప్రశ్న అది. మంచి అనుభవమున్న ప్లీడరుగా ఆనందరావుకి పేరుంది. కానీ అది ఓ జట్కా బండివాడి ముందు ఎందుకూ పనికి రావడంలేదు

"బాబులు చచ్చిపోతే మసీదులో పాతిపెట్టాలా లేక మీ శ్మశానంలో పాతిపెట్టాలా అని ఆలోచిస్తున్నా బాబుగారూ" అన్నాడు దాదా.

"అవేం మాటలురా. ఏదో పొరపాటు జరిగిపోయింది. బాబుల్ని తీసుకెళ్ళడానికి వచ్చాను." అన్నాడు సౌమ్యంగా.

దాదా తీక్షణంగా చూసాడు.

ఆటు తర్వాత రెండు చేతులెత్తి నమస్కారం చేసాడు.

"వద్దు. బాబూ. వద్దు. మీకు వేయి నమస్కారములు. మేం పేదోళ్ళం. చిన్న బతుకులు మావి. అల్లా దయ వుండబట్టి ఈ రోజు బిడ్డ ప్రాణం దక్కింది. నాకదే చాలు. మమ్మల్ని యిలా బతకనివ్వండి."

"తొందరపాటు మనిషి చేసిన తప్పు దాదా యిది. ఇందులో నా అపరాధం ఏమున్నా వుందంటావా? బాబులిని నేను పని కుర్రవాడిగా చూసేనా? నా కొడుకులాగా చూసుకుంటున్నానని నీకు తెలీదా దాదా?" ఆర్ద్రంగా అన్నాడు ఆనందరావు.

"తెలుసు బాబూ. అన్నీ తెలిసిన అమ్మగారే నోరెళ్ళబెట్టుకుని చూస్తూండిపోయారు బాబూ, అదే మీ సొంత బిడ్డయితే వూరుకునేవారా? వద్దు బాబూ. వాడ్ని నా దగ్గరే వుండనియ్యండి. నా బీబీ, నలుగురు బిడ్డలు గుడిసెలో కాలి చచ్చిపోయినప్పుడు కూడా ఇంతనే బాధపడ్లేదు బాబూ. కానీ అన్నెం పున్నెం ఎరుగని వేడిపాల ఎముకలన్నీ విరగొట్టినందుకు కుమిలిపోతున్నాను బాబూ! 'అల్లా' నాకిచ్చిన బిడ్డ వీడు. వీడిక నా దగ్గరే వుంటాడు. వెళ్ళండి బాబు వెళ్ళండి" అన్నాడు దాదా ఆవేశంగా.

దాదా యిక తన మాట వినడని ఆనందరావుకి అర్థమయింది.

ఆనందరావు దిదులుగా చీకటిలో నడుస్తూ వెళ్ళిపోయాడు.

*　　*　　*

బాబులు కోలుకోడానికి దరిదాపుగా నెల పట్టింది ఈ నెల రోజుల్లోనూ ఆనందరావు రెండు మూడుసార్లు వచ్చాడు. సుగుణ ఓసారి వచ్చి వెళ్ళింది. దాదా ఎట్టి పరిస్థితిలోనూ బాబుల్ని పంపనని ఖండితంగా చెప్పేసాడు. బాబులు కూడా భయపడిపోతున్నాడు. వాళ్ళొస్తే కనబడాలంటే కూడా భయంగా అనిపిస్తుంది బాబులికి.

బాబులు లేకపోవడంతో సుగుణకి ఇల్లంతా బోసిగా అనిపిస్తోంది. భర్త కోర్టుకి వెళ్ళిపోయేక ఇంట్లో వంటరిగా వుండాలంటే అసలేమీ తోచడంలేదు. ఆ రోజు తను అడ్డుపడి అన్నగార్ని వారించనందుకిప్పుడు బాధపడుతోంది. అసలు తనలా నిర్లిప్తంగా ఎందుకుండిపోయింది? సుగుణకీ మధ్య ఆరోగ్యం కూడా బాగుండడంలేదు. రెస్టలెస్‌గానూ, కడుపులో నొప్పి...చాలా కాలంగా భరిస్తూ వచ్చింది, కానీ ఇప్పుడు మరీ ఎక్కువగా వుంటోంది. రక్తస్రావం అవుతుంటే బట్టవిడుపు జబ్బుని అశ్రద్ధ చేసింది.

బాధను తట్టుకోలేకపోతుంటే ఆనందరావు డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళాడు.

సుగుణకి క్యాన్సర్ ముదిరిపోయినట్లు డాక్టర్ చెప్పాడు.

సుగుణకి కూడా అర్థమయిపోయింది, తనింక ఎక్కువకాలం బ్రతకనని. బాబులు వెళ్ళిపోయి ఆర్నెల్లు గడిచింది. వాడిని చూడాలని బోలెడంత తపన. కానీ వాడు మళ్ళీ గడపలోకి రాలేదు. పసివాడిని, ఆనాడు పెట్టిన హింసకి, పాపం వూరికే పోతుందా? సుగుణ కుమిలిపోతుంది.

భార్య బ్రతకదని, ఆమె తననించి వెళ్ళిపోబోతున్నదని తెలుసుకున్నాక ఆనందరావు వుదాసీనంగా మారిపోయాడు. ఏవో పిచ్చి ఆలోచనలతో జీవితం శూన్యంగా మారుతున్నట్టు, భయంతో చిక్కిపోతున్నాడు.

ఆనందరావుకి తనవారంటూ ఎవరూలేరు. కేవలం ఈ ప్రపంచంలో నా అన్న వ్యక్తి ఒక్క సుగుణ మాత్రమే అతనికి వున్నది.

సుగుణ చేయిజారిపోతే తన పరిస్థితి ఏమిటి? సుగుణ లేకుండా, ఒంటరిగా తను బ్రతకగలడా? బాబులు ఏ క్షణంలో ఈ ఇల్లు వదిలి వెళ్ళిపోయాడో, ఆ క్షణం నించీ ఈ ఇంటికి శని పట్టిందనిపిస్తోంది అతనికి.

సుగుణ ఒక్కసారి బాబుల్ని చూడాలని ఆరాటపడుతోంది.




ఆదా

మన కంపెనీకి డబ్బు ఆదాచేసే సలహాలు ఇచ్చేవారికి నెలకి ఒకర్ని ఎన్నుకుని వంద రూపాయలు బహుమానం ఇస్తాం-సర్క్యులర్ వచ్చింది.

మొదటి నెల సలహా ఇచ్చిన వ్యక్తి అంకయ్య.

బహుమతి మొత్తాన్ని యాభై రూపాయలకి తగ్గిస్తే యాభై ఆదా అవుతుంది. అతని సలహా.

—సుజయ్‌శ్రీ (ఆదోని)



దాదా వచ్చాడు సుగుణని చూడడానికి. రెండు ఆపిల్ పళ్ళు పక్కన పెట్టాడు.

దాదాని చూసి సుగుణ బావురుమంది. దాదా రెండు చేతుల్నీ పట్టుకుంది. ఆమె కన్నీరు... ఆ కన్నీరు వెనక కనిపించే ఆరాటం, ఆవేదన దాదా అర్థం చేసుకున్నాడు.

"దాదా"

"చెప్పమ్మా"

"నేను చేసిన పాపం పండిందయ్యా. అందుకే దేముడు నాకీ శిక్ష వేశాడు. నా బిడ్డని, బాబుల్ని ఒక్కసారి చూపించవా దాదా. అమ్మని చూడ్డానికి ఒక్కసారి, ఆఖరుసారి వచ్చి నాకు కనిపించమని బాబులికి చెప్పలేవా దాదా?" ఏడుస్తోంది సుగుణ.

దాదా లేచి నిలబడ్డాడు. అరవై ఏళ్ళ జీవితం నేర్పిన పాఠాలెన్నో ఆకళింపు చేసుకున్న మనిషి దాదా. సుగుణ కోరిక కాదనలేకపోయాడు దాదా.

బాబుల్ని తీసుకువచ్చి సుగుణకి చూపించడానికి నిశ్చయించుకున్నాడు దాదా.

"వస్తా బేటీ వాడ్ని తీసుకువచ్చి నీ కప్పగిస్తానమ్మా" అంటూ వెనుదిరిగాడు దాదా.

అదే సమయంలో ఆనందరావు గదిలోకి వచ్చాడు. మాసిన గెడ్డంతో, సంస్కారం లేని జుట్టుతో పిచ్చివాడిలా వున్నాడు ఆనందరావు.

దాదా వెళ్ళిపోయాడు.

భర్తని చూసి వెక్కి వెక్కి ఏడ్చింది సుగుణ.

"ఏడవకు సుగూ, ఏడవకు. నువ్వేడిస్తే నా గుండె పగిలిపోతుంది. దాదా వెళ్ళాడు. నిన్ను చూడ్డానికి బాబుల్ని తీసుకొస్తాడు. ఏడవకు" అన్నాడు దిగులుగా.

"ఏమండీ."

"చెప్పు సుగూ"

"ఏమండీ నేనో కోరిక కోరితే కాదనరుగా?" మెల్లగా అడిగింది. ఆమాటలు ఎక్కడో నూతిలో నుండి వచ్చినట్టుగా వున్నాయి. కళ్ళలో ఏదో భీతి.

"నీ మాట ఏ రోజున్నా కాదన్నానా సుగూ!" ఆనందరావు ఆవేదనగా అన్నాడు.

సుగుణ భర్త మొగంలోకి ఆవేదనగా చూసింది. అతని చేతిని తన చేతిలోకి తీసుకుని ప్రేమగా

"నేను చనిపోతే బాబులు చేత నాకు తలకొరివి పెట్టించరూ!"

ఆనందరావు అయోమయంగా చూసేడు.

"నీ కోరికని నేను కాదనను. కానీ వాడు" ఆనందరావు ఆగిపోయాడు.

"దయచేసి ఇంకేమీ ఆలోచించకండి. నేను చనిపోయేక తన్నా వాడిని మీరు మన బిడ్డగా అంగీకరించాలి."

"సుగుణా"

సుగుణ భర్త కళ్ళల్లో సమాధానం కోసం వెతుకుతోంది.

ఆనందరావు ఖిన్నుడై చూస్తున్నాడు.

మూగగా రోదిస్తున్నాడు.

కొన్ని నిముషాల్లో తన జీవిత భాగస్వామిని తనకు దూరం కాబోతున్నదన్న చేదు నిజాన్ని అతని మనస్సాక్షి అంగీకరించడంలేదు.

గుమ్మంలో చప్పుడయింది. సుగుణ తలెత్తి చూసింది.

దాదా!

దాదా వెనుక బాబులు.

జీవితం అనేది మహా సముద్రం లాంటిది. ఆ జీవిత సముద్రంలో ఎన్నో సుడిగుండాలుంటాయి. తప్పు చేయడం సహజం కావచ్చు. కానీ ఆ తప్పుని సరిదిద్దుకోవడంలోనే గొప్పతనం వుంది.

పధ్నాలుగేళ్ళ క్రితం గోదారి గట్టున ఆమె తండ్రీ, అన్న విసిరేస్తే, ఇంటికి తీసుకువచ్చి, అల్లా ఇచ్చిన బిడ్డగా పెంచుతున్న దాదాకి, అంతిమ క్షణాల్లో కన్నతల్లి చెంతకి కన్న బిడ్డని చేర్చానన్న తృప్తి వృద్ధుడైన దాదా బోసి మొహంలో కనబడుతోంది. బాబుల్ని తట్టి చెప్పాడు దాదా.

"అమ్మగారు చావుబతుకుల్లో ఉన్నారు అమ్మా అని పలకరించు బాబూ!" అని.

సుగుణ కళ్ళు మెరిశాయి.

మంచం మీంచి లేవాలని ప్రయత్నించింది. లేవలేకపోయింది.

ఒక్కసారి తనవితీరా వాడిని గుండెలకు హత్తుకోవాలన్న ఆరాటం. కానీ చేతులు లేవలేదు.

వాడి వళ్ళంతా తడిమి చూడాలని తపన. కానీ కంటి చూపు మసకబారుతోంది.

ఆమె ప్రయత్నాలేవీ ముందుకు సాగడంలేదు. దాదాతో పాటుగా బాబులు ఆమె మంచం దగ్గరగా వచ్చి నిలబడ్డాడు.

"అమ్మా" అని పిలిచాడు బాబులు.

"అమ్మా" అన్న ఆ రెండక్షరాలనీ ఆమె విన్నది.

ఆమె వాడికేసే చూస్తున్నది. బాబులు ఆమె కళ్ళకి మసక మసకగా కనిపిస్తున్నాడు.

అంతే!

రుణం తీరిపోయింది. ✱



## బహుమతులు

మద్రాసు నుంచి వెలువడే ఓ వారపత్రిక కథలపోటీకి బహుమతులు ఇలా ప్రకటించింది.

మొదటి బహుమతి-ఎనిమిది బిందెల నీళ్ళు

రెండో బహుమతి-అయిదు బిందెల నీళ్ళు

మూడో బహుమతి-మూడు బిందెల నీళ్ళు

—జి. కృష్ణ (మదరాసు)

